RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 478 | 25 సెప్టెంబర్ శుక్రవారం 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

# రేవంత్ రెడ్డికి 'బెస్ట్ పబ్లిక్ సర్వెంట్' అవార్డు

- కేరళకు చెందిన ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ పురస్కారం - ప్రజా సంక్షేమ పాలనకు లభించిన జాతీయ గుర్తింపు
- కేరళలోని నిలంబూర్‌లో నేడు అవార్డు ప్రదానోత్సవం - కార్యక్రమానికి హాజరయ్యేందుకు కేరళ వెళ్లిన సీఎం



తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. కేరళకు చెందిన ప్రతిష్ఠాత్మక ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ అందజేస్తున్న 'ఆర్యదాన్ ముహమ్మద్ 2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్' అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. తెలంగాణలో ప్రజాస్వామ్య విలువల పట్ల నిబద్ధతతో పాటు రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం ఆయన అమలు చేస్తున్న వినూత్న పథకాలు, దూరదృష్టి గల నాయకత్వాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ ప్రకటించారు.

ఈ అవార్డు ప్రదానోత్సవం కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు జరగనుంది. దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత ఆర్యదాన్ ముహమ్మద్ 4వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అవార్డును స్వీకరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే కేరళ చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సీ. వేణుగోపాల్ స్మారకోపన్యాసం చేయనున్నారు. రూ. లక్ష నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను రేవంత్ రెడ్డికి అందజేయనున్నారు.

ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ మంత్రి ఏ.పి. అనిల్ కుమార్, ప్రముఖ మేధావి కల్‌పెట్ట నారాయణన్‌లతో కూడిన జ్యూరీ రేవంత్ రెడ్డిని ఈ అవార్డుకు ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. కేరళ రాజకీయాల్లో ఆర్యదాన్ ముహమ్మద్ సీనియర్ నేతగా, 8 సార్లు ఎమ్మెల్యేగా, నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేశారు. కార్మికులు, ప్రజా సంక్షేమం, లౌకికవాద విలువలకు ఆయన ప్రతీకగా నిలిచారు.

### దానం నాగేందర్ అనర్హతపై

## కౌశిక్ రెడ్డి హర్షం



ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పై అనర్హత వేటును సుప్రీంకోర్టు సమర్థించడాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్వాగతించారు. పార్టీ అధినేత కేసీఆర్ మార్గదర్శకత్వంలో న్యాయపోరాటం చేసి కావాల్సిన ఫలితం సాధించామని ఆయన అన్నారు. పార్టీ మారిన ప్రజాప్రతినిధులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్న తమ వాదనకు ఈ తీర్పు బలం చేకూర్చిందని స్పష్టం చేశారు. ఇదే సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీల తీరుపై కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. రెండు పార్టీలు అంతర్గతంగా కలిసి పనిచేస్తున్నాయని, పెద్ద ఎత్తున కుమ్మక్కు రాజకీయం సాగుతోందని ఆరోపించారు. ఒకరి స్వార్థం కోసం మరొకరు సహకరిస్తూ నాటకాలు ఆడుతున్నారని, ఇది సిగ్గుమాలిన చర్య అని అభివర్ణించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.కోర్టులు వేగంగా తీర్పులు ఇస్తున్నాయని కొందరు ఎద్దేవా చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. న్యాయస్థానాల వేగాన్ని, విచారణ తీరును తక్కువ చేసి మాట్లాడటం అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు. చట్టం తన పని తాను చేస్తుందని, న్యాయవ్యవస్థ ఇచ్చిన తీర్పులను గౌరవించాలని సూచించారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు ఉన్నా కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తుందని చెప్పారు.

### స్పీకర్ చాటున దాక్కోవచ్చని భావించిన రాహుల్, రేవంత్‌లకు ఇది

## "సుప్రీం చెంపపెట్టు": కేటీఆర్



బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద తనపై అనర్హత వేటు వేయడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. ఈ విషయంలో జోక్యం చేసుకునేందుకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది.ఈ తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఇది లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తగిలిన "సుప్రీం చెంపపెట్టు" అని అభివర్ణించారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ, అనర్హత వేటు నుంచి తప్పించుకోవడానికి దానం నాగేందర్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. "ఫిరాయింపుల ద్వారా ప్రజా తీర్పును దొంగిలించి, స్పీకర్ చాటున దాక్కోవచ్చని రాహుల్, రేవంత్ భావించారు. స్పీకర్ కార్యాలయాన్ని అడ్డుపెట్టుకుని ఫిరాయింపులను ప్రోత్సహించే వారి ప్రయత్నాలను ఈ తీర్పు బట్టబయలు చేసింది" అని కేటీఆర్ ఆరోపించారు.త్వరలో ఖైరతాబాద్‌లో జరగనున్న ఉప ఎన్నికల్లో ప్రజలు మూడేళ్ల ద్రోహానికి, హామీల ఉల్లంఘనకు తగిన తీర్పు ఇస్తారని ఆయన వ్యాఖ్యానించారు. "ఒక వికెట్ పడింది.. త్వరలో మరిన్ని పడతాయి" అని హెచ్చరిస్తూ, తన పోస్ట్ చివరలో "మార్క్ మై వర్డ్స్, ఎమ్మెల్యే చోర్ ఏరాహుల్‌గాంధీ" అని ఘాటుగా విమర్శించారు.

కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిపై హరీశ్ రావు ఫైర్

సుప్రీంకోర్టు తీర్పును బీఆర్ఎస్ శాసనసభ ఉప నాయకుడు హరీశ్ రావు కూడా స్వాగతించారు. "రాజ్యాంగాన్ని కాపాడతాం" అని చెప్పే కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి ఇది చెంపపెట్టు అని అన్నారు. "పదేపదే 'సంవిధాన్ బచావో' అని నినదించే రాహుల్ గాంధీకి ఇప్పుడు అసలైన పరీక్ష ఎదురైంది. ఆయనకు నిజంగా రాజ్యాంగంపై నమ్మకం ఉంటే, కాంగ్రెస్‌లో చేరిన మిగతా ఎమ్మెల్యేలందరితో వెంటనే రాజీనామా చేయించి, తిరిగి ప్రజా తీర్పు కోరాలి" అని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రాజ్యాంగ నైతికత గురించి మాట్లాడి, తెలంగాణలో తమ పార్టీ చర్యలపై మౌనంగా ఉండటం సరికాదని హరీశ్ రావు విమర్శించారు. "సంవిధాన్ బచావో అనేది రాజ్యాంగ నిబద్ధతా లేక కేవలం రాజకీయ నినాదమా?" అని ఆయన ప్రశ్నించారు.

### యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో బొగ్గు కొరతకు

## కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం

**: జగదీశ్ రెడ్డి**



నల్గొండ జిల్లా దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో ఎదురవుతున్న బొగ్గు కొరతకు, విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని మాజీ మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు.ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ప్రతినిధుల బృందంతో కలిసి ఆయన ఈరోజు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను స్వయంగా పరిశీలించారు. అనంతరం ప్లాంట్ అధికారులతో సమావేశమై విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడానికి గల సాంకేతిక, పరిపాలనాపరమైన కారణాలపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. సింగరేణి సంస్థ నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, ప్లాంట్లకు సక్రమంగా సరఫరా చేయకుండా దాదాపు 40 లక్షల టన్నుల బొగ్గును పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలోని పవర్ ప్లాంట్లకు బొగ్గు కొరత సృష్టించి, ప్రజలను ముఖ్యంగా రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఏ విధంగానైతే 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్‌ను అందించిందో, అదే రీతిలో పవర్ ప్లాంట్లకు పూర్తిస్థాయిలో బొగ్గు సరఫరా చేసి నిరంతర విద్యుత్ అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## 'ఎన్నికలకు సిద్ధం అవుతా'..

### సుప్రీం తీర్పుపై దానం నాగేందర్



ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ సుప్రీంకోర్టు తీర్పుపై స్పందించారు. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సంపూర్ణంగా గౌరవిస్తున్నానని తెలిపారు. చట్టపరమైన ప్రక్రియ పట్ల ఉన్న గౌరవంతోనే తాను న్యాయపోరాటం చేశానని చెప్పారు. ఇక తన భవిష్యత్తును ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటానని స్పష్టం చేశారు. "కోర్టు తీర్పు ఇలా వస్తుందని ముందే ఊహించాను. అయితే రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం కొంత ఊరట లభిస్తుందని భావించాను. అందుకే చట్టపరంగా చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశాను" అని దానం నాగేందర్ పేర్కొన్నారు.ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైన నేపథ్యంలో తాను సిద్ధంగా ఉన్నట్లు దానం తెలిపారు. ఖైరతాబాద్ ప్రజలతో తనకు దశాబ్దాలుగా అనుబంధం ఉందన్నారు. నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో ఎప్పుడూ వారికి అండగా ఉన్నానని చెప్పారు. రాబోయే ఉప ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లి వారి ఆశీర్వాదం కోరతానన్నారు. ప్రజల మద్దతు తనకే ఉంటుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. దీనిపై దాఖలైన అనర్హత పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు ఆయనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించి ఖైరతాబాద్ సీటు ఖాళీ అయినట్లు పేర్కొంది.

హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. నేడు అత్యున్నత న్యాయస్థానం ఆయన పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సమర్థించింది. దీంతో ఖైరతాబాద్‌లో ఉప ఎన్నికకు మార్గం ఏర్పడింది.

## దంచికొట్టిన వానలు



బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం బుధవారం అర్ధరాత్రి కళింగపట్నం వద్ద తీరాన్ని తాకింది. దీంతో గురువారం జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. హనుమకొండ, జనగామ, కరీంనగర్, సూర్యాపేట, వరంగల్, ఖమ్మం, కుమ్రం భీం, మహబూబాబాద్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి-కొత్తగూడెం, మంచిర్యాల, నల్లగొండ, పెద్దపల్లి, సిద్దిపేట, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలు పడ్డాయి. కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు, ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, పెద్దపల్లి, సూర్యాపేట జిల్లాలకు అధికారులు ఆరెంజ్ హెచ్చరిక జారీచేశారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, నల్లగొండ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఖమ్మం జిల్లాలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో రెండు రోజులపాటు భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని సూచించారు.ప్రపంచ పటాలు పరిశీలించండి

**పిడుగుపాటు.. ముగ్గురు కూలీలు మృతి**

వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం సూగూరులో పొలం పనులకు వెళ్లిన మహిళలపై పిడుగు పడి ముగ్గురు మృతిచెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వరి పొలంలో కలుపు తీస్తుండగా ఒకసారిగా పిడుగు పడి కుమ్మరి లక్ష్మి మృత్యువాతపడింది. ఎడ్ల యాదమ్మ కూలీ పనులకు వెళ్లి ఇంటికి వస్తుండగా మార్గం మధ్యలో పిడుగుపడటంతో ఆమె మరణించారు.

**పలు ప్రాంతాల్లో 10 సెం.మీపైగా..**

సీజన్‌లో మొదటిసారి పలు జిల్లాల్లో 10 సెం.మీపైగా వర్షపాతం నమోదైనట్టు వాతవరణ శాఖ అధికారులు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో 12.36 సెం.మీ, పెద్దవంగరలో 11.86 సెం.మీ, మరిపెడలో 11.41 సెం.మీ, నెల్లికోదూరులో 10.83 సెం.మీ, చిన్నగూడురులో 10.34 సెం.మీ, మధిరలో 11.72 సెం.మీ, ముదిగొండలో 11.61 సెం.మీ వర్షపాతం నమోదైంది.

# కేటీపీపీ సందర్శనకు బయలుదేరిన బీఆర్ఎస్ నేతలకు ముందస్తు అరెస్ట్

## చిట్యాల మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**

**తేదీ 24-09-2026 చిట్యాల మండలం**
భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పిలుపు మేరకు కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (కేటీపీపీ) సందర్శనకు బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులను చిట్యాల మండల కేంద్రంలో పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ సమస్యలు, విద్యుత్ కోతలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు గణపురం మండలం చెల్పూర్‌లోని కేటీపీపీ (జెన్కో) సందర్శనకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ప్రజాప్రతినిధులు వెళ్లాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో చిట్యాల మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు అల్లం రవీందర్ మాట్లాడుతూ ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చేపట్టిన కార్యక్రమాన్ని అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. "ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య హక్కులను అడ్డుకోవడమే" అంటూ వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. అరెస్టైన వారిలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు అల్లం రవీందర్, మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, మండల ప్రధాన కార్యదర్శి మడికొండ రవీందర్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్ బాబు, మండల యువజన అధ్యక్షుడు తౌటం నవీన్, టౌన్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీధర్ గౌడ్,ఎలగొండ తిరుపతి, మాజీ సర్పంచ్ పుట్టపాక మహేందర్,



సీనియర్ నాయకులు సాధ మల్లయ్య, వేముల శ్రీనివాస్, గోపగాని నర్సింహ రాములు తదితరులు ఉన్నారు.

# చిట్యాల మోడల్ స్కూల్‌లో ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం





**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**

చిట్యాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల/కళాశాల (మోడల్ స్కూల్)లో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ మేకల రమేష్ ఆధ్వర్యంలో, ఎన్ఎస్ఎస్ భూపాలపల్లి కోఆర్డినేటర్ యుగేందర్, ప్రోగ్రాం ఆఫీసర్ వాసాల వెంకటేశ్వర్లు సమక్షంలో విద్యార్థినీ, విద్యార్థులతో పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ వాసాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశ అభివృద్ధి, శ్రేయస్సు కోసం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజంలోని రుగ్మతలను తొలగిస్తూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పంచభూతాల పరిశు భ్రతే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. దేశ శ్రేయస్సే తమ శ్రేయస్సుగా యువత భావించాలని తెలిపారు.
తోటి మానవులకు సహాయం చేయడం, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం మానవతా దృక్పథానికి నిదర్శనమని అన్నారు.
ఎన్ఎస్ఎస్ అంటే నేషనల్ సర్వీస్ స్కీమ్ అని, ఇతరుల నుంచి ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సేవ చేయడమే దీని ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల/కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నీలం రవీందర్, భాస్కర్, పుట్టరాజు, ఆరేపల్లి రాము, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫార్మసీ అధికారుల సమస్యలు పరిష్కరించాలి

## - 732 పోస్టుల భర్తీతోపాటు పదోన్నతులు, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 హైదరాబాద్ ఎస్టేట్:**

ఫార్మసీ అధికారుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, ప్రజారోగ్య వ్యవస్థలో వారి సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీపీఓఏ) రాష్ట్ర అధ్యక్షుడు బి. సుదర్శన్ గౌడ్ బాతిని కోరారు. ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన ఫార్మసీ అధికారులు, వృత్తి నిపుణులకు శుభాకాంక్షలు తెలిపారు. మందుల నాణ్యత, ఔషధ భద్రత, సముచిత వినియోగం, నిల్వ, పంపిణీలో ఫార్మసీ అధికారుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రత్యేక ఫార్మసీ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని, సర్వీసులో కనీసం మూడు పదోన్నతులు లభించేలా విధానం రూపొందించాలని కోరారు. 13 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన అర్హులకు నిబంధనల ప్రకారం పదోన్నతులు కల్పించాలని, నోటిఫికేషన్ నంబర్ 5/2024లోని 732 ఫార్మసీ ఆఫీసర్ పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. 104/ఎఫ్‌డీహెచ్ఎస్ ఫార్మసీ అధికారులకు కొనసాగింపు ఉత్తర్వులు జారీ చేసి, ఎనిమిది నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, కాంట్రాక్ట్, ఎన్‌హెచ్ఎం, యూపీహెచ్‌సీ, ఆర్‌బీఎస్‌కే, ఔట్‌సోర్సింగ్ ఫార్మసీ అధికారులకు ఉద్యోగ భద్రత, బీమా, సకాలంలో వేతనాలు కల్పించాలని కోరారు. పల్లె దవాఖానాలు, బస్తీ



దవాఖానాలు, పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరానికి అనుగుణంగా ఫార్మసీ పోస్టులు పెంచడంతోపాటు బోధనాసుపత్రుల్లో క్లినికల్ ఫార్మసీ సేవలను బలోపేతం చేయాలని సుదర్శన్ గౌడ్ బాతిని కోరారు.

# హుస్సేన్ సాగర్ వాటర్ స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్ గోకుల్‌పై చర్యలు తీసుకోవాలి

## శాట్స్ ఎండీకి కయాకింగ్ అండ్ కెనోయింగ్ అసోసియేషన్ ఫిర్యాదు

**హైదరాబాద్, సెప్టెంబర్ 24:**
హుస్సేన్ సాగర్ వాటర్ స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్, హైదరాబాద్ జిల్లా యువజన క్రీడల అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఏ.ఎన్.కె. గోకుల్ అమానుష వైఖరి, పరిపాలనా లోపాలు మరియు నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ కయాకింగ్ & కెనోయింగ్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ రుద్రవరం సునీల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) మేనేజింగ్ డైరెక్టర్ సోని బాల దేవిని గురువారం కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు.
ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ హైదరాబాద్ , కాచిగూడలో మీడియాతో మాట్లాడుతూ... గతంలో కూడా క్రీడా పరిపాలనకు సంబంధించి గోకుల్‌పై సస్పెన్షన్, క్రమశిక్షణా చర్యలు తీసుకున్న దాఖలాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి రెగ్లింగ్ టోర్నమెంట్‌లో ఆయన తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలు, వివాదాస్పద తీర్పులతో పాటు గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన పరిపాలనా బాధ్యతలపై కూడా తీవ్ర ఆరోపణలు ఉన్నట్లు గుర్తుచేశారు.
తాజాగా సెప్టెంబర్ 18న జరిగిన 8వ 'ఖేలో ఇండియా' సెలెక్షన్స్‌లో కయాకింగ్, కెనోయింగ్ కోచ్‌ల పట్ల ఆయన అత్యంత దూకుడుగా, దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. క్రీడాకారులు, అసోసియేషన్ సభ్యుల సమక్షంలోనే అసభ్యకర, అభ్యంతరకర పదజాలంతో దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన ఒకటి, రెండు ఎడిషన్ల 'సీఎం కప్' పోటీల్లో కూడా వాటర్ స్పోర్ట్స్ క్రీడలకు సరైన ఏర్పాట్లు చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. సాధారణ శిక్షణ సమయంలో అడ్డంకులు సృష్టించడమే కాకుండా, తెలంగాణ పోలీస్ జట్టు శిక్షణకు సైతం అవసరమైన సదుపాయాలు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు.
హైదరాబాద్ డీవైఎస్ఓ, ట్యాంక్‌బండ్ వాటర్ స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్, రెగ్లింగ్ ఇన్‌ఛార్జ్‌గా ఒకే అధికారికి మూడు కీలక బాధ్యతలు అప్పగించడంతో ఆయన



ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. క్రీడాకారులు, కోచ్‌ల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆయనపై నిష్పాక్షిక విచారణ జరిపి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని, ఆ బాధ్యతల నుంచి ఆయనను తప్పించి అర్హులైన ఇతర అధికారులకు అప్పగించాలని అసోసియేషన్ తరపున శాట్స్ ఎండీని ఆయన కోరారు.

# ఐలమ్మ జయంతికి తరలిరావాలి

## - 26న కాకతీయ యూనివర్సిటీ వద్ద జయంతి కార్యక్రమం

**కాకతీయ యూనివర్సిటీ, సెప్టెంబర్ 24 హైదరాబాద్ ఎస్టేట్:**



భూమి, భుక్తి కోసం.. వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరవనిత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రజక విద్యార్థి విభాగం ఇన్‌చార్జి కోరపల్లి రాజేష్ పిలుపునిచ్చారు. ఈ నెల 26న శనివారం కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఐలమ్మ పోరాట స్ఫూర్తిని నేటి తరానికి చాటిచెప్పేలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, మేధావులు, కవులు, కళాకారులు, బీసీ సంఘాల నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# వరంగల్ విమానాశ్రయానికి పాపన్న పేరు పెట్టాలి

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అంబాల మల్లేష్ గౌడ్

## కార్యనిర్వాహక అధ్యక్షులు పల్లె గణేష్ గౌడ్

**ఎల్బీనగర్ సెప్టెంబర్ 24**





మామునూరులో నిర్మిస్తున్న విమానాశ్రయానికి తెలంగాణ యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ రాష్ట్ర అధ్యక్షులు అంబాల మల్లేష్ గౌడ్ కార్యనిర్వహణ అధికారి పల్లె గణేష్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ శివాజీగా పేరొందిన పాపన్న ఖిలాషాపూర్‌లో జన్మించి, మొఘల్ పాలనకు వ్యతిరేకంగా పోరాడారని పేర్కొన్నారు. భువనగిరి, తాటికొండ, వరంగల్ కోటలను జయించిన ఆయన పేరు పెట్టడం ద్వారా తెలంగాణ చరిత్ర, ఆత్మగౌరవాన్ని భవిష్యత్ తరాలకు చాటినట్లవుతుందని తెలిపారు. వారు ఈ సందర్భంగా అన్నారు

# హరారేలో వైభవంగా గణేష్ నవరాత్రి వేడుకలు

**హైదరాబాద్ సెప్టెంబర్ 24**



హరారే జింబాబ్వే రాజధాని హరారేలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు మధు దేవ్ దంపతులతో పాటు శశికుమార్ తదితరులు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చన, భజనలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. చివరి రోజు నిర్వహించిన లడ్డూ వేలంలో బద్దం నరేష్ రెడ్డి రూ.8 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. పూజా వస్త్రాన్ని ప్రశాంత్ రెడ్డి రూ.2,07,933కు సొంతం చేసుకున్నారు. అనంతరం గణేశుడి నిమజ్జనాన్ని ఆటపాటలతో ఉత్సాహంగా నిర్వహించారు.

# తుక్కుగూడలో నార్త్ స్టార్ ఎయిర్పోర్ట్ బౌలే వార్డ్ సొసైటీ ఎన్నికలు

## కొత్త పాలకవర్గం ఎన్నికల - ఫలితాల విడుదల




**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 24:)**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం తుక్కుగూడ లో నార్త్‌స్టార్ ఎయిర్‌పోర్ట్ బౌలేవార్డ్ సొసైటీ కొత్త పాలకవర్గం ఎన్నిక ఫలితాల విడుదల నార్త్‌స్టార్ ఎయిర్‌పోర్ట్ బౌలేవార్డ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ (రిజిస్ట్రేషన్ సంఖ్య: టీఎస్ ఎంసి /డి సి ఓ /ఆర్ ఆర్ /3905/2019) డైరెక్టర్ల బోర్డు (కమిటీ సభ్యుల) ఎన్నికల ఫలితాలు అధికారికంగా విడుదలయ్యాయి. ఈ ఎన్నికలు 2026 సెప్టెంబర్ 24న నార్త్‌స్టార్ ఎయిర్‌పోర్ట్ బౌలేవార్డ్‌లోని క్లబ్ హౌస్, మల్టీపర్పస్ హాల్‌లో నిర్వహించబడ్డాయి.
ఈ మొత్తం ఎన్నికల ప్రక్రియను తాత్కాలిక (అడ్‌హాక్) ఎన్నికల కమిటీ ఛైర్మన్ ఎం. ఆర్. కె. ప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించి, ఫలితాలను అధికారికంగా ప్రకటించారు.
ఎన్నికైన డైరెక్టర్ల బోర్డు సభ్యులు మరియు సాధించిన ఓట్లు:
ఎం. దర్శన్ గౌడ్ 34 ఓట్లు,బరాల హర్‌పూల్ సింగ్ 33 ఓట్లు,ఎం. అనిల్ వెంకటాద్రి 32 ఓట్లు,బాలాభద్ర సాంబశివరావు 31 ఓట్లు, ఏనుగుల శ్రీనాథ్ 28 ఓట్లు,మన్నేపల్లి దేవాదాసు 28 ఓట్లు, యార్లగడ్డ కావ్య చౌదరి 26 ఓట్లు,సింధిరి ప్రతాప్ రావు 24 ఓట్లు,డి. వెంకటరత్నం 23 ఓట్లు,నూతనంగా ఎన్నికైన ఈ పాలకవర్గం విల్లా నివాసితుల సంక్షేమం, సొసైటీ నిర్వహణ మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షిస్తుంది.

# బుద్ధారం బిడ్డగా మొదలై.. భూపాలపల్లి అభివృద్ధి బాటలో అడుగులు

## కొడవటంచ అభివృద్ధికి ప్రత్యేక చొరవ.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**

భూపాలపల్లి: బుద్ధారం మట్టిలో పుట్టి.. ప్రజల మధ్య పెరిగిన గండ్ర సత్యనారాయణరావు నేడు భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పుట్టిన ఊరి అనుబంధాన్ని మరువకుండా.. నియోజకవర్గంలోని పల్లెలు, పట్టణాలు, ప్రజల అవసరాలను తెలుసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు.

ప్రజా జీవితంలోకి వచ్చిన నాటి నుంచి సామాన్యుల సమస్యలపై స్పందిస్తూ, పేదలు, రైతులు, గ్రామీణ ప్రజల అవసరాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అభివృద్ధి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు ఆయన చేపట్టిన కార్యక్రమాలు సూచిస్తున్నాయి.

**బుద్ధారం మట్టిలో పుట్టి..ప్రజల మధ్య పెరిగిన నాయకత్వం**

బుద్ధారం ఆయన పుట్టిన ఊరు. ఆ గ్రామ మట్టితో ఉన్న అనుబంధం, ప్రజలతో కలిసిమెలిసి ఉండే స్వభావం ఆయన ప్రజా జీవితంలోనూ కనిపిస్తోందని అనుచరులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల కష్టాలు, అవసరాలను దగ్గరగా తెలుసుకున్న నేపథ్యంతో నియోజకవర్గంలోని పల్లెల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారని వారు పేర్కొంటున్నారు.

పుట్టిన గడ్డపై ఉన్న అనుబంధాన్ని నియోజకవర్గంలోని ప్రతి గ్రామంతో ఏర్పరచుకోవాలనే ఆలోచనతో ప్రజల మధ్యకు వెళ్తూ.. సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి చేస్తున్నారనే అభిప్రాయం స్థానికంగా వ్యక్తమవుతోంది.

**కొడవటంచ అభివృద్ధికి ప్రత్యేక చొరవ**

భూపాలపల్లి నియోజకవర్గానికి ప్రత్యేక ఆధ్యాత్మిక గుర్తింపుగా నిలిచే కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్ర అభివృద్ధిపై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రత్యేక దృష్టి సారించారు. ఆలయ అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలిస్తూ, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

కొడవటంచను ఆధ్యాత్మిక కేంద్రంతో పాటు పర్యాటక ప్రాధాన్యం ఉన్న ప్రాంతంగా అభివృద్ధి చేయాలనే ఆలోచనకు ప్రాధాన్యం ఇస్తున్నారు. క్షేత్రానికి వచ్చే భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పరిసరాల అభివృద్ధి, ఇతర సౌకర్యాల కల్పనపై దృష్టి సారించడం ద్వారా కొడవటంచకు మరింత గుర్తింపు తీసుకురావాలనే ప్రయత్నం కొనసాగుతోంది.

**పల్లెల అభివృద్ధికి పెద్దపీట**

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రజలకు నిత్యజీవితంలో ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలనే దిశగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించడం మాత్రమే కాకుండా వాటి పురోగతిని పరిశీలించడం, అధికారులతో సమీక్షలు నిర్వహించడం ద్వారా పనులు నాణ్యతతో పూర్తయ్యేలా చూడాలని సూచిస్తున్నారు.

**పేదల సంక్షేమంపై దృష్టి**

పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడటం, అర్హులకు ఇళ్లు, రేషన్, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా అధికార యంత్రాంగంతో సమన్వయం చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.



పేదల కష్టాలను దగ్గరగా చూసిన నాయకుడిగా.. వారి సమస్యలకు పరిష్కారం చూపాలనే తపనతో పనిచేయడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పలు సందర్భాల్లో పేర్కొంటున్నారు.

**రైతు సమస్యలపై స్పందన**

భూపాలపల్లి నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చిస్తూ రైతులకు ప్రభుత్వ సహాయం అందేలా చూడాలని సూచిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు, పంటల కొనుగోలు, సాగునీరు తదితర అంశాల్లో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన కార్యక్రమాలు వెల్లడిస్తున్నాయి.

**యువతకు అవకాశాలే లక్ష్యం**

విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అంశాల్లో భూపాలపల్లి యువతకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే ప్రస్తావిస్తున్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు యువత ఆధునిక నైపుణ్యాలను అందిపుచ్చుకునేలా శిక్షణ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలనే దిశగా చర్యలు చేపడుతున్నారు.

**పట్టణం నుంచి పల్లె వరకు..**

భూపాలపల్లి పట్టణ అభివృద్ధితో పాటు నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల మౌలిక వసతులపైనా దృష్టి సారించడం ద్వారా పట్టణంపల్లె మధ్య అభివృద్ధి సమతుల్యత సాధించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముందుకు సాగుతున్నారు.

రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, ప్రజా భవనాలు వంటి మౌలిక వసతులతో పాటు విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని గుర్తించి ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేస్తున్నారు.

**బుద్ధారం నుంచి భూపాలపల్లి వరకు..**

బుద్ధారం మట్టిలో పుట్టిన బిడ్డగా మొదలైన ప్రయాణం.. నేడు భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రజా సమస్యల పరిష్కారం వైపు సాగుతోంది. పుట్టిన ఊరి అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూనే నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నానని గండ్ర సత్యనారాయణరావు చెబుతున్నారు.

కొడవటంచ క్షేత్ర అభివృద్ధి నుంచి పల్లెల్లో రోడ్లు, డ్రైనేజీల వరకు.. రైతుల సమస్యల నుంచి పేదల సంక్షేమం వరకు.. భూపాలపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

బుద్ధారం బిడ్డగా మొదలైన అడుగులు.. భూపాలపల్లి అభివృద్ధి బాటలో కొనసాగుతున్నాయి.

# జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం - మునికుంట్ల గణేష్‌కు ఘన సత్కారం

**వరంగల్, సెప్టెంబర్ 24, హైదరాబాద్ ఎస్టేట్:**




విద్యాబోధనలో అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల సమగ్ర వికాసానికి కృషి చేస్తున్న ఉపాధ్యాయుడు మునికుంట్ల గణేష్‌కు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఆల్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ (టిఏపిటిఏ) ఆధ్వర్యంలో ఆయనకు ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు గణేష్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్. ఆంజనేయులు, కాకతీయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్లు తిరునగరి శేషు, డాక్టర్ కె. సాయికృష్ణ, టిఏపిటిఏ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు చందర్ లాల్ నాయక్ చౌహాన్ పాల్గొని పురస్కారాన్ని అందజేశారు. గణేష్‌కు విద్యావేత్తలు, తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

# రెడ్‌క్రాస్ కమిటీకి ముల్క ప్రసాద్ నామినేషన్

## - ప్రజాసేవలను విస్తృతం చేయడమే లక్ష్యం..

## - రక్తదానం, ఆరోగ్య సేవలకు ప్రాధాన్యం

**వరంగల్, సెప్టెంబర్ 24 హైదరాబాద్ ఎస్టేట్:**

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా పోటీ చేస్తున్న ముల్క ప్రసాద్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. వరంగల్ జిల్లా పరిషత్ కార్యాలయంలోని జడ్పీ హాల్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ముల్క ప్రసాద్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తృతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తన లక్ష్యమన్నారు. రక్తదాన కార్యక్రమాలను విస్తరించడం, ఆరోగ్య సేవలను బలోపేతం చేయడం, విపత్తుల సమయంలో సహాయక చర్యలను మరింత సమర్థంగా నిర్వహించడం, సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేయడంపై దృష్టి సారిస్తామని తెలిపారు. రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలను మరింత బలోపేతం చేసేందుకు ప్యానల్ సభ్యులతో సమన్వయంతో పనిచేస్తామని పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ సభ్యుల విశ్వాసాన్ని పొందేందుకు కృషి చేస్తున్నామని, తమ




ప్యానల్ సభ్యులకు మద్దతుగా ఓటు వేసి గెలిపించాలని ముల్క ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. నామినేషన్ కార్యక్రమంలో ప్యానల్ సభ్యులు వడిచర్ల నగేష్, జలిగపు రామ్‌ప్రసాద్‌తో పాటు మద్దతుదారులు, పలువురు రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

# దాడి ఘటనపై విచారణ జరపాలి

## - వినయ్ భాస్కర్‌కు న్యాయం చేయాలి..

## - ఆధారాల మేరకు చర్యలు తీసుకోవాలి



**వరంగల్, సెప్టెంబర్ 24, హైదరాబాద్ ఎస్టేట్:**

మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌పై జరిగినట్లు పేర్కొంటున్న దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఆధారాల మేరకు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇసంపల్లి సంజీవ కోరారు. బాధితుడి వాంగ్మూలంతో పాటు వైద్య, మెడికో–లీగల్ నివేదికలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, అందుబాటులో ఉన్న వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని పోలీసులను కోరారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఘటనను ప్రత్యేకంగా పరిశీలించి నిష్పక్షపాత విచారణకు ఆదేశాలు ఇవ్వాలని సంజీవ విజ్ఞప్తి చేశారు. విచారణలో ఎవరి ప్రమేయమైనా ఆధారాలతో తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్మిక సంఘాలతో వినయ్ భాస్కర్‌కు సుదీర్ఘ అనుబంధం ఉందని, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆయన అండగా నిలిచారని పేర్కొన్నారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద శ్రీధర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మడికొండ బాబు, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి జిలకర స్వామి, రాష్ట్ర అధికార ప్రతినిధి మామిడాల వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు చీకటి కుమార్, గుండా రమేష్, పసునూరి బాబు, నాయకులు భానోతు శంకర్ నాయక్, కందికొండ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

# రికార్డ్ స్థాయిలో ముచ్చర్ల వినాయకుడి లడ్డూ: 5,53,000 ఉట్టు పద్మ మహేందర్

**హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 24**

పోటా పోటీగా ముచ్చర్ల గణేష్ ఉత్సవ కమిటీ వద్ద లడ్డు సవాల్ 5,53000 (అక్షరాల ఐదు లక్షల యాభై మూడు వేల రూపాయలు)కు ముచ్చర్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ ఊటు పద్మ మహేందర్ కైవసం చేసుకున్నారు.

ఈ లడ్డు దక్కించుకోవడంలో ఆ భగవంతుడి ఆశీర్వాదం ఎంతో ఉందని అన్నారు.లడ్డు దక్కడం సంతోషంగా ఉందన్నారు. చండీ ఉపాసకులు శ్రీ రేవెల్లి రాజు శర్మ అయ్యగారు 9 రోజులు నిత్యపూజలు నిర్వహించారు.రాజు శర్మ అయ్యగారి నిర్వహణలో లడ్డు గ్రహీత సర్పంచ్ ఊటు పద్మ మహేందర్ లడ్డును అందించారు.శాలువా కప్పి పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.గ్రామస్తులందరూ ఎంతో సంతోషించారు.రికార్డ్ స్థాయిలో లడ్డు ప్రసాదం దక్కించుకోవడం మన గ్రామానికి గర్వకారణమని తెలిపారు.ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ సిద్ధాల రమణ మాజీ సర్పంచ్ ఇంజమూరి రామచంద్ర రెడ్డి బక్క అంజయ్య చేగురి బీరప్ప తల్లోజు నందీశ్వర్ ఎంపీటీసీ బక్క మల్లేష్ రేపని రవి బండ వెంకటేష్ కుమ్మరి వెంకటేష్ శంకరి వెంకటేష్ బండ నర్సింహ చెగురి మల్లేష్ బక్క వెంకటేష్



మున్నూరు సంజీవులు శ్రీశైలం శివ పృథ్వీ భజన మండలి తదితరులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

# హైదరాబాదులో ఘనంగా షర్మిల కుమార్తె నిశ్చితార్థం..

## హాజరైన సీఎం రేవంత్ రెడ్డి

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఇంట పెళ్లి సందడి మొదలైంది. ఆమె కుమార్తె అంజిలి రెడ్డి, సోమల రఘురామ్ రెడ్డిల నిశ్చితార్థ వేడుక గురువారం హైదరాబాద్ శివారులోని కొత్వాల్‌గూడలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీసమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాబోయే వధూవరులను ఆయన ఆశీర్వదించారు.ఈ నిశ్చితార్థ వేడుకలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహా పలువురు రాజకీయ ప్రముఖులు, కుటుంబ సభ్యులు, ఆత్మీయులు పాల్గొన్నారు. నూతన జంటకు వారు శుభాకాంక్షలు తెలియజేశారు. కుటుంబ సభ్యుల మధ్య ఈ వేడుక వైభవంగా జరిగింది.కాగా, తన కుమార్తె వివాహానికి సంబంధించిన కీలక తేదీలను షర్మిల కొద్ది రోజుల క్రితమే స్వయంగా ప్రకటించారు. సెప్టెంబర్ 24న నిశ్చితార్థం, నవంబర్ 25న వివాహం, డిసెంబర్ 5న రిసెప్షన్ ఉంటుందని ఆమె ఎక్స్ వేదికగా వెల్లడించారు. వివాహ వేడుకకు సంబంధించిన మొదటి ఆహ్వాన పత్రికను ఇడుపులపాయలోని తన తండ్రి, దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఘాట్ వద్ద ఉంచి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ క్రమంలో, వివాహ ఆహ్వానం కోసం తన సోదరుడు వైఎస్ జగన్‌ను కలవడంపై వస్తున్న రాజకీయ ఊహాగానాలను షర్మిల



ఖండించారు. తన కుమార్తె వివాహానికి అన్ని రాజకీయ పార్టీల అధినేతలను ఆహ్వానిస్తానని, ఇందులో ఎలాంటి రాజకీయ కోణాలు చూడవద్దని ఆమె స్పష్టం చేశారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్ లను కలిసిన రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

**హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 24**

రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలిగా నూతనంగా నియమితులైన చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (డిప్యూటీ సీఎం) మల్లు భట్టి విక్రమార్క ని). మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి మరియు జిల్లా సమగ్ర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై డిప్యూటీ సీఎంతో చర్చించారు. ఈ ప్రయాణంలో ఆయన పూర్తి సహకారం అందించాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు.

అనంతరం రంగారెడ్డి జిల్లాకు చెందిన (ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి(షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్)... మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా వారు చర్చించారు.



# ఇందిరమ్మ ఇళ్ల బిల్లులపై వివరణ

## - రాష్ట్ర వాటా రూ.3.40 లక్షలు జమ..
## - కేంద్ర నిధుల కోసం ఎదురుచూపులు
## : దాడి శివ



**గీసుగొండ, సెప్టెంబర్ 24, హైదరాబాద్ ఎస్టేట్:**

గీసుగొండ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయంటూ వచ్చిన వార్తపై మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దాడి శివ వివరణ ఇచ్చారు. 290 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రాష్ట్ర వాటాగా రూ. 3.40 లక్షలు ఇప్పటికే జమ అయినట్లు తెలిపారు. మిగిలిన రూ. 1.60 లక్షలు కేంద్రం నుంచి రావాల్సిన పీఎంఏవైజీ నిధులని, అవి విడుదల కాకపోవడంతో తుది బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విషయంపై పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో కలిసి సంబంధిత గృహనిర్మాణ శాఖ అధికారులను సంప్రదించినట్లు దాడి శివ తెలిపారు. తుది ఫొటో క్యాప్చర్ పూర్తయిన లబ్ధిదారులకు కేంద్ర నిధులు విడుదలైన వెంటనే వారం, పది రోజుల్లో బిల్లులు జమ చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి లబ్ధిదారుడికి పూర్తి బిల్లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని దాడి శివ అన్నారు. ఈ అంశంపై ప్రతిపక్షాల రాజకీయ ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు.

# భగత్‌సింగ్‌నగర్‌లో ఘనంగా గణేష్ ఉత్సవాలు

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్స్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్





**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఎల్బీనగర్. , సెప్టెంబర్ 24:**

భగత్‌సింగ్‌నగర్ ఫేజ్-1లో చెలిమి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అసోసియేషన్ సభ్యులు శ్రీధర్ గౌడ్, శివ గౌడ్‌ల ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా డాక్టర్స్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధనరాజ్ గౌడ్ మాట్లాడుతూ భక్తులందరూ భగవంతుని కృపకు పాత్రులు కాగలరని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు అనంతరం ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న చెలిమి యూత్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు సంతోష్ కుమార్, యువ నాయకులు భార్గవ్ గౌడ్ తో పాటు అసోసియేషన్ సభ్యులు, స్థానిక భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ని లడ్డూను వేలం పాటలో 50016 కైవసం చేసుకున్న అరుష్ హాస్పిటల్ ఎం.డి



**హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 24**

ఆర్కపల్లి గ్రామం మాడ్గుల మండలం రంగారెడ్డి జిల్లా లో శివ శక్తి గణేష్ ఉత్సవ కామిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ లడ్డును 50016 రూపాయలకు ఆరుష్ హాస్పిటల్ వీణ యాచారపు శ్రీనివాస్ గౌడ్ కైవసం చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఆ రూష్ హాస్పిటల్ ఎండి మాట్లాడుతూ శివశక్తి గణేష్ కమిటీలో లడ్డు వేలంపాటలో గెలుచుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది అన్నారు ఈ కార్యక్రమంలోగ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు గ్రామ యువకులు పూర ప్రముఖులు పాల్గొన్నారు

# సమిష్టి సహకారంతోనే జర్నలిస్టుల సంక్షేమం

## : విశ్వబ్రాహ్మణ జర్నలిస్ట్ నూతన కమిటీ సమావేశం

**హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ**

వరంగల్‌బిజర్నలిస్టుల సమిష్టి సహాయ సహకారంతోనే వారి సంక్షేమం సాధ్యమవుతుందని తెలంగాణ విశ్వబ్రాహ్మణ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఓదెల సత్యనారాయణ అన్నారు.

వరంగల్ లో హనుమకొండ వరంగల్ జిల్లాల నూతన జిల్లా కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ జర్నలిస్టుల ఐక్యతను బలోపేతం చేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి కలకోట వీరభద్ర చారి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రతి సభ్యునికి అండగా నిలుస్తూ సహకరిస్తుందని అన్నారు. సంఘం ఆధ్వర్యంలో సభ్యుల సంక్షేమానికి పలు కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి కొత్త సభ్యులను సంఘంలోకి ఆహ్వానించారు. సంఘ భవిష్యత్ కార్యాచరణ, అభివృద్ధిపై చర్చించి, అందరి సహకారంతో సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు.



ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు కుంటమల్ల అరవింద్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఉల్లి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమరేంద్ర చారి, ఉపాధ్యక్షులు ఆకోజు సాంబయ్య, కోశాధికారి రాంపల్లి శ్రీనివాసచారి, హనుమకొండ జిల్లా గౌరవ అధ్యక్షులు తొగిటి గురుబ్రహ్మాచారి, ఉపాధ్యక్షులు ఆకోజు పూర్ణచందర్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీపాద శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాలలో అన్నదాన కార్యక్రమం

## కాంగ్రెస్ సీనియర్ నాయకులు మెట్టు రవీందర్ గౌడ్

**ఎల్బీనగర్ సెప్టెంబర్ 24**



వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాగోల్ జీఎస్ఐ డివిజన్ పరిధిలో గురువారం పలు వినాయక మండపాలను సందర్శించిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మెట్టు రవీందర్ గౌడ్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం వివిధ మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు

# గణనాథుని నిమజ్జనం ఘనంగా

కౌడిపల్లి హైదరాబాద్ ఎస్టేట్ సెప్టెంబర్ 24

మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం బుజరంపేట్ గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. గ్రామంలోని హనుమాన్ టెంపుల్ వద్ద హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణనాథుని విగ్రహాన్ని ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించారు. ప్రతిరోజూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో గురువారం గణనాథుని నిమజ్జన కార్యక్రమాన్ని హనుమాన్ యూత్ అసోసియేషన్ సభ్యులు, గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు.

నిమజ్జనానికి ముందు గణనాథుని విగ్రహాన్ని పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డప్పు చప్పుళ్లు, భక్తుల నినాదాల మధ్య గణనాథుని విగ్రహాన్ని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఊరేగింపులో యువత, చిన్నారులు, మహిళలు, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులు నినాదాలు చేస్తూ గణనాథునికి వీడ్కోలు పలికారు. గ్రామంలోని



ప్రధాన వీధుల్లో గణనాథుని ఊరేగింపు కొనసాగడంతో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు గణనాథునిపై పూలు చల్లి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం నిర్ణయించిన నిమజ్జన ప్రదేశానికి గణనాథుని విగ్రహాన్ని తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

గణనాథుని నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. నవరాత్రుల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవ కార్యక్రమాలను నిర్వహించడంలో హనుమాన్ యూత్ అసోసియేషన్ సభ్యులు కీలకంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా హనుమాన్ యూత్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, గ్రామ ప్రజల సహకారంతో వినాయక నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. గణనాథుని ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హనుమాన్ యూత్ అసోసియేషన్ సభ్యులు, యువత, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీమకు మహర్దశ..

## రూ.లక్ష కోట్ల పెట్టుబడితో హార్టీకల్చర్ హబ్



రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన పంటల కేంద్రంగా (గ్లోబల్ ఫ్రూట్ బౌల్) తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బృహత్ ప్రణాళికను సిద్ధం చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో సుమారు రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో 'రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ హబ్' ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో సీఎం ఈ వివరాలు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు రాయలసీమలోని 10 జిల్లాల్లో 201 క్లస్టర్ల ద్వారా ఈ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో ప్రభుత్వం రూ. 40 వేల కోట్లు, ప్రైవేటు రంగం రూ. 60 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. ఒకప్పుడు కరవుతో అల్లాడిన రాయలసీమను ఉద్యాన రంగం ద్వారా ఆర్థికంగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. హంద్రీనీవా, గాలేరు-నగరి వంటి ప్రాజెక్టుల ద్వారా నీటి లభ్యత పెరగడం ఈ మార్పునకు దోహదం చేసిందని ఆయన గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను (ఎఫ్‌పీవో) బలోపేతం చేయనున్నారు. కొత్త పంటలు, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. ఇదే కార్యక్రమంలో భాగంగా మదనపల్లెలో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'కు కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఈ సమీక్షలో ఎల్‌నినో ప్రభావం, ద్రవ్యోల్బణంపై కూడా సీఎం అధికారులతో చర్చించారు. ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు శనగ, మినుము, రాగులు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. నిత్యావసరాల ధరలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూనే వినియోగదారులపై భారం పడకుండా చూడాలని ఆదేశించారు. ఈ హబ్ ద్వారా రాబోయే 5-6 ఏళ్లలో సీమ రూపురేఖలు మార్చాలని లక్ష్యంగా నిర్దేశించారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
25 సెప్టెంబర్ శుక్రవారం 2026

# రాష్ట్ర సమస్యలపై సమగ్ర పోరాటానికి ఆర్‌పీఐ (అంబేద్కర్) కార్యాచరణ

## రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు

**హైదరాబాద్ స్టేట్ న్యూస్ ప్రతినిధి విజయవాడ సెప్టెంబర్ 24:**

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు మరియు జాతీయ కార్యదర్శి డాక్టర్ పిట్టా వరప్రసాద్ అధ్యక్షతన విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో జరిగింది.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆర్‌పీఐ (అంబేద్కర్) దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు శ్రీ పి. అంజయ్య పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ మట్టే బాబి సమావేశ ఎజెండాను ప్రవేశపెట్టారు.

ఈ సందర్భంగా శ్రీ సురేష్ కుమార్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేయాలి

రాబోయే గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని సమావేశం నిర్ణయించింది. ప్రతి గ్రామం, మండలం, పట్టణంలో పార్టీ కమిటీలను పటిష్టం చేసి ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేయాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

కరువు మండలాలను ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి అర్హత ఉన్న ప్రాంతాలను కరువు మండలాలుగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సమావేశం డిమాండ్ చేసింది.

కరువు ప్రభావిత రైతులకు పంట నష్టం పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట రుణాల రీషెడ్యూలింగ్, తాగునీరు, పశువులకు మేత వంటి సహాయాన్ని అందించాలని కోరింది.

రైతులు, వ్యవసాయ కార్మికులకు అండగా నిలవాలి

పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, సాగునీటి సమస్య పరిష్కారం, నాణ్యమైన విత్తనాలుఎరువులు అందుబాటులో ఉంచడం, పంట నష్టపోయిన రైతులకు సకాలంలో పరిహారం చెల్లించడం, వ్యవసాయ కార్మికులకు ఉపాధి అవకాశాలు పెంచడం వంటి అంశాలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించారు.

యువతకు ఉద్యోగాలు కల్పించాలి

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఉద్యోగ క్యాలెండర్‌ను అమలు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరింది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల హక్కుల పరిరక్షణ

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సంక్షేమానికి సంబంధించిన పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చూడాలని నిర్ణయించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను సమర్థవంతంగా వినియోగించడం, బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయడం, దళితుల భూములు మరియు ఇళ్ల సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని నిర్ణయించారు.

దళితులపై దాడులను అరికట్టాలి

ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడులను అరికట్టేందుకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, బాధితులకు సకాలంలో పరిహారం, పునరావాసం, న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది.

భూమిలేని పేదలకు భూమి ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

భూమిలేని దళితులు, పేదలకు భూమి పంపిణీ చేయాలని,







డి-పట్టా భూములకు రక్షణ కల్పించాలని, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణ సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ధరల పెరుగుదలను నియంత్రించాలి

నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేసి పేదలకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందించాలని కోరింది.

పింఛన్లు, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలి

వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, ఇతర అర్హులైన పేదలకు పింఛన్లు మరియు సంక్షేమ పథకాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని సమావేశం కోరింది.

గ్రామీణ మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలి

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం వంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఉద్యమం

రాష్ట్రంలో సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ఆర్‌పీఐ (అంబేద్కర్) నిరంతరం ప్రజల పక్షాన పోరాడాలని రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయించింది.

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మరియు జాతీయ కార్యదర్శి డాక్టర్ పిట్టా వరప్రసాద్ మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాల సాధన కోసం పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బలోపేతం చేస్తామని, రైతులు, దళితులు, గిరిజనులు, బీసీలు, మైనారిటీలు, మహిళలు, యువత, పేదల సమస్యలపై నిరంతర ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు.

"ప్రజల సమస్యలే పార్టీ ఎజెండా రాజ్యాంగ హక్కుల పరిరక్షణే మా లక్ష్యం" అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దొడ్డ నాగమల్లి రాజు, గంజి పూర్ణిమ, రాష్ట్ర కార్యదర్శి కోల హరిబాబు, ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు కొంగర గణపతి, లీగల్ సెల్ టీం నాయకులు గంజి మురార్జీ రాజు, డివివిఎన్ మూర్తి, పట్టపు రంగారావు, వి స్వప్న, యువజన రాష్ట్ర అధ్యక్షులు పెదపాటి కళ్యాణ్ కుమార్, ఎం వరప్రసాద్, పాము వెంకటేశ్వరరావు, రాజేష్ తిరుపతి, తదితరులు పాల్గొని ప్రసంగించారు

# వినాయక మండపాలలో అన్నదాన కార్యక్రమం

## కాంగ్రెస్ సీనియర్ నాయకులు మెట్టు రవీందర్ గౌడ్

**ఎల్బీనగర్ సెప్టెంబర్ 24**



వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాగోల్ జీఎస్ఐ డివిజన్ పరిధిలో గురువారం పలు వినాయక మండపాలను సందర్శించిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మెట్టు రవీందర్ గౌడ్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం వివిధ మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

# చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

## - ఆర్థిక, వ్యక్తిగత సమస్యలే కారణమని భార్య ఫిర్యాదు




**గీసుగొండ, సెప్టెంబర్ 24, హైదరాబాద్ ఎస్టేట్:**



వంచనగిరి గ్రామానికి చెందిన ఎడ్డె రవికుమార్ (42) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. గీసుగొండ పోలీసుల వివరాల ప్రకారం.. రవికుమార్ కొంతకాలంగా ఆర్థిక, వ్యక్తిగత సమస్యలతో మనస్తాపానికి గురవుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 20న బతుకమ్మ గడ్డ సమీపంలో పురుగుమందు సేవించగా కుటుంబ సభ్యులు తొలుత ఎంజీఎం ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం హన్మకొండలోని ఏకశిల ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం సుమారు 11 గంటలకు మృతి చెందాడు. మృతిపై తమకు ఎలాంటి అనుమానం లేదని, ఆర్థిక, వ్యక్తిగత సమస్యల కారణంగానే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అతని భార్య ఎడ్డె సుమలత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుగొండ ఇన్‌స్పెక్టర్ డి. విశ్వేశ్వర్ తెలిపారు.

# హనుమకొండ గోపాల్‌పూర్ నేచర్ కాలనీలో 9 రోజుల పాటు ఘనంగా వినాయక చవితి వేడుకలు







(హైదరాబాద్ ఎస్టేట హనుమకొండ ప్రతినిధి వక్కల రమేష్ సెప్టెంబర్ 24)హనుమకొండ, గోపాల్‌పూర్: భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మికత, ఆనందోత్సాహాల నడుమ గోపాల్‌పూర్ నేచర్ కాలనీలో వినాయక చవితి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. వినాయకుడి ప్రతిష్ఠాపన రోజు నుంచి నిమజ్జనం వరకు తొమ్మిది రోజుల పాటు కాలనీ వాసులు నియమ నిష్ఠలతో, భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాన్ని పూలు, తోరణాలు, రంగురంగుల అలంకరణలతో అందంగా తీర్చిదిద్దారు. శ్రీ విఘ్నేశ్వర స్వామివారిని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించి, ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హారతులు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని దర్శించుకున్నారు. మహిళలు సంప్రదాయ చీరల్లో పాల్గొని పూజా కార్యక్రమాలకు ప్రత్యేక శోభను తీసుకురాగా, యువత, పురుషులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాల నిర్వహణలో తమ వంతు సహకారం అందించారు. ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు ప్రతి రోజూ నియమ నిష్ఠలతో పూజలు నిర్వహించడం ఈ వేడుకలకు ప్రత్యేకతగా నిలిచింది. చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ భక్తితో పాల్గొని గణనాథుని ఆశీస్సులు పొందారు. తొమ్మిది రోజుల పాటు "గణపతి బప్పా మోర్యాడ మంగళమూర్తి మోర్యా" అంటూ చేసిన నినాదాలతో నేచర్ కాలనీ ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. కాలనీ వాసుల ఐక్యత, పరస్పర సహకారం, భక్తి భావం ఈ వేడుకల్లో ప్రతిబింబించాయి.

నిమజ్జనంతో ముగిసిన తొమ్మిది రోజుల వేడుకలు

తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న శ్రీ గణనాథుడికి నిమజ్జనం సందర్భంగా ప్రత్యేక పూజలు, హారతి నిర్వహించి, కన్నుల పండువగా ఊరేగింపుతో వీడ్కోలు పలికారు. భక్తులు భావోద్వేగంతో గణనాథుడిని సాగనంపుతూ వచ్చే ఏడాది మరింత వైభవంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.

"వచ్చే ఏడాది మరింత వైభవంగా తిరిగి రావాలిడ కాలనీ వాసులందరినీ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆశీర్వదించాలి" అని భక్తులు గణనాథుడిని ప్రార్థించారు.

వేడుకల నిర్వహణలో తమ విలువైన సమయాన్ని కేటాయించి, ప్రతి కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసిన కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువత మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ నేచర్ కాలనీ వాసుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు.
మీ అందరి సహకారం, సమిష్టి కృషి వల్లే ఈ తొమ్మిది రోజుల వినాయక చవితి వేడుకలు విజయవంతంగా, వైభవంగా జరిగాయి.

: గణపతి బప్పా మోర్యా!

- మంగళమూర్తి మోర్యా!

: వచ్చే ఏడాది మరింత వైభవంగా రా గణనాథా! :
ఇట్లు:నేచర్ కాలనీ కమిటీ

# ఐసీసీ చైర్మన్ జై షాతో నారా లోకేశ్ భేటీ.. ఏపీ స్పోర్ట్స్ హబ్‌పై చర్చ

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అహ్మదాబాద్‌లో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) చైర్మన్ జై షాతో భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రధాన క్రీడా కేంద్రంగా (స్పోర్ట్స్ హబ్) తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో తమ ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రణాళికలను ఈ సందర్భంగా జై షాకు వివరించారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను లోకేశ్ తన 'ఎక్స్' ఖాతా ద్వారా వెల్లడించారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై తాము చర్చించినట్లు లోకేశ్ తెలిపారు. విశాఖపట్నాన్ని వాటర్ స్పోర్ట్స్ డెస్టినేషన్‌గా అభివృద్ధి చేయడం, రాష్ట్రంలో దేశీయ, మహిళా క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించడం, అట్టడుగు స్థాయి నుంచి క్రీడా ప్రతిభను ప్రోత్సహించడం వంటి విషయాలను జై షా దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇండోర్ క్రికెట్ అకాడమీల నిర్మాణంపైనా ప్రత్యేకంగా చర్చించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ క్రికెట్ పోటీలను విస్తరించాలని, ముఖ్యంగా బాలికలతో పాటు యువ క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు సృష్టించాలన్న తమ ప్రణాళికలను జై షాతో పంచుకున్నట్లు లోకేశ్ వివరించారు. ఈ సమావేశం ఎంతో సంతోషాన్నిచ్చిందని, తన మిత్రుడైన జై షా



అందించిన ఆతిథ్యం, అద్భుతమైన గుజరాతీ సంప్రదాయ భోజనం మరువలేనివని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# బుద్దారం బిడ్డగా మొదలై.. భూపాలపల్లి అభివృద్ధి బాటలో అడుగులు

## కొడవటంచ అభివృద్ధికి ప్రత్యేక చొరవ.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**

భూపాలపల్లి: బుద్దారం మట్టిలో పుట్టి.. ప్రజల మధ్య పెరిగిన గండ్ర సత్యనారాయణరావు నేడు భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పుట్టిన ఊరి అనుబంధాన్ని మరువకుండా.. నియోజకవర్గంలోని పల్లెలు, పట్టణాలు, ప్రజల అవసరాలను తెలుసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు.

ప్రజా జీవితంలోకి వచ్చిన నాటి నుంచి సామాన్యుల సమస్యలపై స్పందిస్తూ, పేదలు, రైతులు, గ్రామీణ ప్రజల అవసరాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అభివృద్ధి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు ఆయన చేపట్టిన కార్యక్రమాలు సూచిస్తున్నాయి.

**బుద్దారం మట్టిలో పుట్టి..ప్రజల మధ్య పెరిగిన నాయకత్వం**

బుద్దారం ఆయన పుట్టిన ఊరు. ఆ గ్రామ మట్టితో ఉన్న అనుబంధం, ప్రజలతో కలిసిమెలిసి ఉండే స్వభావం ఆయన ప్రజా జీవితంలోనూ కనిపిస్తోందని అనుచరులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల కష్టాలు, అవసరాలను దగ్గరగా తెలుసుకున్న నేపథ్యంతో నియోజకవర్గంలోని పల్లెల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారని వారు పేర్కొంటున్నారు.

పుట్టిన గడ్డపై ఉన్న అనుబంధాన్ని నియోజకవర్గంలోని ప్రతి గ్రామంతో ఏర్పరచుకోవాలనే ఆలోచనతో ప్రజల మధ్యకు వెళ్తూ.. సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి చేస్తున్నారనే అభిప్రాయం స్థానికంగా వ్యక్తమవుతోంది.

**కొడవటంచ అభివృద్ధికి ప్రత్యేక చొరవ**

భూపాలపల్లి నియోజకవర్గానికి ప్రత్యేక ఆధ్యాత్మిక గుర్తింపుగా నిలిచే కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్ర అభివృద్ధిపై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రత్యేక దృష్టి సారించారు. ఆలయ అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలిస్తూ, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

కొడవటంచను ఆధ్యాత్మిక కేంద్రంతో పాటు పర్యాటక ప్రాధాన్యం ఉన్న ప్రాంతంగా అభివృద్ధి చేయాలనే ఆలోచనకు ప్రాధాన్యం ఇస్తున్నారు. క్షేత్రానికి వచ్చే భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పరిసరాల అభివృద్ధి, ఇతర సౌకర్యాల కల్పనపై దృష్టి సారించడం ద్వారా కొడవటంచకు మరింత గుర్తింపు తీసుకురావాలనే ప్రయత్నం కొనసాగుతోంది.



**పల్లెల అభివృద్ధికి పెద్దపీట**

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రజలకు నిత్యజీవితంలో ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలనే దిశగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళు _న్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించడం మాత్రమే కాకుండా వాటి పురోగతిని పరిశీలించడం, అధికారులతో సమీక్షలు నిర్వహించడం ద్వారా పనులు నాణ్యతతో పూర్తయ్యేలా చూడాలని సూచిస్తున్నారు.

**పేదల సంక్షేమంపై దృష్టి**

పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడటం, అర్హులకు ఇళ్లు, రేషన్, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా అధికార యంత్రాంగంతో సమన్వయం చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

పేదల కష్టాలను దగ్గరగా చూసిన నాయకుడిగా.. వారి సమస్యలకు పరిష్కారం చూపాలనే తపనతో పనిచేయడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పలు సందర్భాల్లో పేర్కొంటున్నారు.

**రైతు సమస్యలపై స్పందన**

భూపాలపల్లి నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చిస్తూ రైతులకు ప్రభుత్వ సహాయం అందేలా చూడాలని సూచిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు, పంటల కొనుగోలు, సాగునీరు తదితర అంశాల్లో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన కార్యక్రమాలు వెల్లడిస్తున్నాయి.

**యువతకు అవకాశాలే లక్ష్యం**

విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అంశాల్లో భూపాలపల్లి యువతకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే ప్రస్తావిస్తున్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు యువత ఆధునిక నైపుణ్యాలను అందిపుచ్చుకునేలా శిక్షణ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలనే దిశగా చర్యలు చేపడుతున్నారు.

**పట్టణం నుంచి పల్లె వరకు..**

భూపాలపల్లి పట్టణ అభివృద్ధితో పాటు నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల మౌలిక వసతులపైనా దృష్టి సారించడం ద్వారా పట్టణంపల్లె మధ్య అభివృద్ధి సమతుల్యత సాధించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముందుకు సాగుతున్నారు.

రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, ప్రజా భవనాలు వంటి మౌలిక



వసతులతో పాటు విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని గుర్తించి ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేస్తున్నారు.

**బుద్దారం నుంచి భూపాలపల్లి వరకు..**

బుద్దారం మట్టిలో పుట్టిన బిడ్డగా మొదలైన ప్రయాణం.. నేడు భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రజా సమస్యల పరిష్కారం వైపు సాగుతోంది. పుట్టిన ఊరి అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూనే నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నానని గండ్ర సత్యనారాయణరావు చెబుతున్నారు.

కొడవటంచ క్షేత్ర అభివృద్ధి నుంచి పల్లెల్లో రోడ్లు, డ్రైనేజీల వరకు.. రైతుల సమస్యల నుంచి పేదల సంక్షేమం వరకు.. భూపాలపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

బుద్దారం బిడ్డగా మొదలైన అడుగులు.. భూపాలపల్లి అభివృద్ధి బాటలో కొనసాగుతున్నాయి.

# స్థానిక సంస్థల ఎన్నికలు..

## అభ్యర్థుల ఎంపికపై జగన్ కీలక సూచనలు



ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ శ్రేణులు పూర్తిస్థాయిలో సమాయత్తం కావాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్లతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన రాబోయే ఎన్నికల కార్యాచరణపై విస్తృతంగా చర్చించి నేతలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలైనంత త్వరగా ప్రజాదరణ కలిగిన మంచి అభ్యర్థులను గుర్తించాలని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఏకపక్షంగా కాకుండా పార్టీలోని ప్రతి ఒక్కరి అభిప్రాయాలను సేకరించి, పలు దఫాలుగా విస్తృత చర్చలు జరిపిన తర్వాతే తుది జాబితాను ఖరారు చేయాలని ఆదేశించారు. ఇప్పుడు ఎంపిక చేసే అభ్యర్థులు రాబోయే సాధారణ ఎన్నికలకు బలమైన పునాదిగా నిలుస్తారని పేర్కొన్నారు.
ముఖ్యమంత్రి చంద్రబాబు రెండున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని జగన్ ఆరోపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల వల్ల ప్రజలకు జరుగుతున్న కష్టాలు, మోసాలను ప్రతి గడప వద్దకూ వెళ్లి వివరించాలని కేడర్‌కు సూచించారు. వైసీపీ హయాంలో అందించిన సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేస్తూనే, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో గెలిచేందుకు ప్రభుత్వం అధికార బలంతో పాటు పోలీసు వ్యవస్థను ఉపయోగిస్తూ అనేక అడ్డదారులు తొక్కుతుందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఎలాంటి కుట్రలు ఎదురైనా తట్టుకునేలా పార్టీ శ్రేణులు ముందస్తుగా సిద్ధంగా ఉండాలని, రీజినల్ కో-ఆర్డినేటర్లు ప్రత్యామ్నాయ ప్రణాళికలు కూడా సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# డీజేలకు నో.. సంప్రదాయ డప్పులకు జై !

## జగ్గయ్యపేటలో ఎస్సై రాజు వినూత్న పోలీసింగ్ !

జగ్గయ్యపేట:
నిమజ్జన వేడుకలు అంటే డీజేల హోరు.. కానీ జగ్గయ్యపేటలో మాత్రం సీన్ మారింది !

సౌండ్ పొల్యూషన్‌కు చెక్ పెట్టారు.. డీజేలకు నో చెప్పారు.. సంప్రదాయ డప్పు కళాకారులతో నిమజ్జన ఊరేగింపు నిర్వహించారు !

ప్రజలకు ఇబ్బంది లేకుండా.. పండుగ ఉత్సాహం తగ్గకుండా ఎస్సై రాజు తీసుకున్న ఈ నిర్ణయంపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

అంతేకాదు.. పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని మతాల కార్యక్రమాల్లో ప్రజలతో మమేకమవుతూ.. శాంతిభద్రతలకు ప్రాధాన్యం ఇస్తున్న ఎస్సై రాజు "అందరివాడు"గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారని స్థానికులు అభినందిస్తున్నారు.

డీజేలకు నో.. సంప్రదాయాలకు జై..
ప్రజలతో మమేకమైన పోలీసింగ్‌కు ఇదే నిదర్శనం !








